క్లుప్తంగా

ఉపాధి పనుల పరిశీలన



పాన్‌గల్: మండలంలోని కిష్టాపూర్‌తండాలో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులను సోమవారం ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. వేసవి కాలం దృష్ట్యా నిబంధనలు, జాగ్రత్తలను పాటిస్తూ పనులను చేపట్టాలని సిబ్బందికి సూచించారు. పనుల వద్ద వసతులను ఆయా గ్రామ పంచాయతీలు ఏర్పాటు చేయాలన్నారు. చేపట్టే పనులు రైతులకు ఉపయోగపడే వాటికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

ముగిసిన బండలాగుడు పోటీలు



గోపాల్‌పేట: శ్రీరామనవమి సందర్భంగా కోదండ రామస్వామి కల్యాణోత్సవంతో ప్రారంభమైన గోపాల్‌పేట జాతర సోమవారం స్థానిక ఎద్దుల బండలాగుడు పోటీలను నిర్వహించడంతో ముగిశాయి. శుక్రవారం, శనివారం, ఆదివారం మూడు రోజుల పాటు అంతర్రాష్ట్ర స్థాయి పెద్దబండ, నడిపి బండ, చిన్నబండ పోటీలు నిర్వహించిన తర్వాత సోమవారం గోపాల్‌పేట మండల కేంద్రానికి చెందిన ఎద్దుల జోడీలతో బండలాగుడు పోటీలు నిర్వహించారు.

విద్యార్థులకు రక్త పరీక్షలు



పాన్‌గల్: మండలంలోని గోప్లాపూర్ ప్రాథమిక పాఠశాలలో మొదటి, రెండో తరగతి విద్యార్థులకు పైలేరియా నివారణ కార్యక్రమంలో భాగంగా సోమవారం రక్త పరీక్షలు నిర్వహించినట్లు వైద్య సిబ్బంది పేర్కొన్నారు. ఆయా తరగతుల్లో 50 మంది విద్యార్థుల నుంచి రక్త నమూనాలను సేకరించామని తెలిపారు. ఈ సర్వే వల్ల పిల్లల్లో మైక్రో పైలేరియా వృద్ధి ఏవిధంగా ఉందో తెలుసుకునే అవకాశం ఉందన్నారు. దీంతో పైలేరియా నివారణ కార్యక్రమాన్ని సంపూర్ణంగా విజయవంతం చేయగలుగుతామన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి రాజశేఖర్, వైద్య సిబ్బంది శ్రీనివాస్, వెంకటేష్, జహంగీర్, రామచందర్, భారతి, నాగేశ్వరి, హెచ్‌ఎం పాల్గొన్నారు.

రంజాన్ పండుగకు వసతులు కల్పించాలి



అమరచింత: ఈనెల 22న జరిగే రంజాన్ పర్వదినం సందర్భంగా ఈద్గాలో వసతులు కల్పించాలని పట్టణ జామియా మజీద్ సదర్ కమిటీ ఆధ్వర్యంలో పుర చైర్మన్ మంగమ్మ, మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఖాజాలకు వినతిపత్రం అందించారు. ఈమేరకు కమిటీ సభ్యులు మాట్లాడుతూ రంజాన్ పండుగ సందర్భంగా ఈద్గాకు ఇరువైపులా రహదారులు పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. తాగునీటి వసతి, కరెంటు సౌకర్యం కల్పించాలన్నారు. పవిత్ర నమాజ్‌లో పాల్గొనే ప్రదేశంలో టెంట్లు ఏర్పాటు చేసి వేసవి ఎండల నుంచి ఉపశమనం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జామియా మజీద్ కమిటీ సభ్యులు తౌఫిక్ ,రఫిక్, అయుబ్, కుతుబ్, సయ్యద్, పాషా, దస్తగిర్, బడేసాలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు



వనపర్తి క్రైం: మండలంలోని మెంటిపల్లికి చెందిన 50మంది బీఆర్ఎస్ నాయకులు సోమవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మెంటిపల్లికి చెందిన బీఆర్ఎస్ నాయకులు ధర్మారెడ్డి, జలంధర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, మన్నెపురెడ్డి, అశోక్‌రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, వెంకట్‌రెడ్డి, నరేందర్‌రెడ్డితోపాటు 50మంది కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు జిల్లెల ఆదిత్యారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరగా.. వారికి రేవంత్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ అధికారం చేపడుతుందన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, దేవన్నయాదవ్ తదితరులు ఉన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించం



వీపనగండ్లలో కంటి పరీక్షల నిర్వహణలో సూచనలు ఇస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శ్రీనివాసులు

వీపనగండ్ల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమంలో వైద్య సిబ్బంది బాధ్యతగా మెలగాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శ్రీనివాసులు అన్నారు. సోమవారం బొల్లారం గ్రామంలో నిర్వహిస్తున్న కంటివెలుగు శిబిరాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. కంటివెలుగు శిబిరంలో కంటి పరీక్షలు, అద్దాలు తీసుకున్న వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకునేందుకు వైద్య సిబ్బంది తమ వంతు బాధ్యత వహిస్తూ ఆయా గ్రామాల్లోని ప్రజాప్రతినిధుల సహకారాన్ని తీసుకోవాలని సూచించారు. కంటి పరీక్షలు, అద్దాల పంపిణీపై క్యాంప్ ఆఫీసర్ డాక్టర్ రియాకు ఆయన పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

అమరచింత: పట్టణంలో కంటివెలుగు శిబిరాలను ఆయా వార్డుల వారీగా ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నామని, 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ కోరారు. మహిళా సమాఖ్య భవనంలో సోమవారం కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈమేరకు చైర్‌పర్సన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కంటివెలుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ప్రజలందరికీ ఉచితంగా కంటి అద్దాలను ఇవ్వడం ఎంతో సంతోషకరమన్నారు. రెండో విడతకు ప్రజల నుంచి విశేష ఆదరణ వస్తున్నదన్నారు. కొట్లాడి తెచ్చుకున్న రాష్ట్రంలో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలనే సంకల్పంతో సీఎం కేసీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకొస్తున్నారని తెలిపారు. కంటి పరీక్షలు ఉచితంగా నిర్వహించడమే కాకుండా శస్త్ర చికిత్సలు సైతం ఉచితంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఖాజా, కౌన్సిలర్లు లావణ్య, సింధు తదితరులు పాల్గొన్నారు.



అమరచింతలో..

'హామీల అమలులో ఎమ్మెల్యే విఫలం'



మాట్లాడుతున్న చంద్రశేఖర్

చిన్నంబావి: కొల్లాపూర్ నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి పూర్తిగా విఫలమయ్యారని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌యాదవ్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 98 జీఓ అమలు చేయకపోతే రాజీనామా చేస్తానని హామీ ఇచ్చి ఆ విషయం విస్మరించారని, వెంటనే 98 జీఓ అమలు చేయాలని లేదంటే ఎమ్మెల్యే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. 2016లో చిన్నంబావిని మండల కేంద్రంగా ప్రకటించినప్పుడు శ్రీశైలం బ్యాక్ వాటర్ ముంపు వల్ల 10 గ్రామ పంచాయతీలు నష్టపోయాయని వారిని ఆదుకుంటానని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని మరిచిపోయారని ఎద్దేవా చేశారు. వెంటనే బ్యాక్ వాటర్ వల్ల నష్టపోయిన వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. చిన్నమారు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా చివరి ఆయకట్టు వరకు పూర్తి స్థాయిలో నీటిని పంటలకు అందించాలన్నారు. దీంతో పాటు మండల కేంద్రంలో నిర్మిస్తానన్న సమీకృత భవనం, వెలటూరు, చెట్టిపాడు గ్రామాల డబుల్ రోడ్డు, మాదాసి మాదారి కుర్వలకు ఇచ్చిన హామీలు, గూడెం గ్రామానికి వేస్తానన్న రోడ్డు, 98 జీవో ఉద్యోగాలు వంటి హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్, కిసాన్ సెల్ అధ్యక్షుడు నందికంటి పుల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రతాప్‌రెడ్డి, కొప్పునూరు గ్రామ పార్టీ అధ్యక్షుడు రమణారెడ్డి, మోహన్‌రెడ్డి, వెలగొండ వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే ఈటల రాక

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఏర్పాటు చేసిన మహాత్మ జ్యోతిరావుపూలే విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి మంగళవారం హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ హాజరవుతున్నట్లు మత్స్యశాఖ సంఘం సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి అన్ని పార్టీల నాయకులు, పట్టణ మున్సిపాలిటీ పాలక వర్గం నాయకులు హాజరు కావాలని కోరారు.

గోపాల్‌పేటలో ఇఫ్తార్ ఏర్పాటు



గోపాల్‌పేట: మండల కేంద్రంలోని మసీదులో ముస్లింలకు మాజీ మంత్రి చిన్నారెడ్డి సోమవారం సాయంత్రం ఇఫ్తార్ ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఆయన ముస్లింలతో కలిసి ఇఫ్తార్ చేశారు. రంజాన్ మాసంలో ముస్లింలు ఎంతో పవిత్రంగా ఉపవాసాలు చేస్తారని, వారికి అంతా మంచే జరగాలని కోరుకుంటూ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ ప్రెసిడెంట్ రాజేంద్రప్రసాద్, గోపాల్‌పేట మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నరహరి, జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు కొంకి వెంకటేష్, జిల్లెల ప్రవీన్‌కుమార్, మండల బీసీ సెల్ అధ్యక్షుడు వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని మసీదులో సోమవారం రాత్రి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శెట్టిశేఖర్ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఉపవాస దీక్షలు ఉన్న ముస్లింలకు పండ్లను తినిపించి దీక్షలను విరమింపజేశారు. తర్వాత మసీదులోనే ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ తాజొద్దీన్, నాయకులు ఖదీర్, ఖలీల్ తదితరులు ఉన్నారు.

నిరుద్యోగ భృతి వెంటనే అమలు చేయాలి



మాట్లాడుతున్న ఎండీ కుతుబ్

పాన్‌గల్: వివిధ రకాల ఉద్యోగాలకు దరఖాస్తులు చేసుకున్న నిరుద్యోగులందరికీ వెంటనే నిరుద్యోగ భృతి ఇవ్వాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎండీ కుతుబ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని కేతేపల్లిలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ 2018 ఎన్నికల మేనిఫెస్టోలో నిరుద్యోగులందరికీ నిరుద్యోగ భృతి నెలకు రూ.3,116 ఇస్తామని ప్రకటించిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీని అమలు ఇప్పుడు, అప్పుడు అంటూ కాలయాపన చేస్తూ నిరుద్యోగులను మోసం చేస్తుందని దుయ్యబట్టారు. ఉద్యోగాలకు సిద్ధమవుతున్న తరుణంలో పేపర్ల లీకేజీతో ఉద్యోగ పరీక్షల రద్దు కారణంగా నిరుద్యోగులు నైరాశ్యంలో మునిగిపోయారని వాపోయారు. ఉద్యోగ పరీక్షలు ఎప్పుడు జరుగుతాయో, భర్తీ ఎప్పుడు చేస్తారో తెలియని పరిస్థితి ఉందన్నారు. ఉద్యోగాలను భర్తీ చేసే వరకు నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇచ్చి వారిని ఆదుకోవాలని కోరారు. పేపర్ల లీకేజీలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు సంతోష్, సభ్యులు రామాంజనేయులు, సీపీఐ మండల కార్యదర్శి కుర్మయ్య పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్ నాయకుల ముందస్తు అరెస్ట్



అరెస్టయిన యూత్ కాంగ్రెస్ నాయకులు

వనపర్తి క్రైం: పేపర్ లీకేజీ వ్యవహారంలో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనారెడ్డి ఆదేశాల మేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడికి వెళ్తున్న యువజన కాంగ్రెస్ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ టెన్త్ పేపర్ లికేజీ విషయంలో పెద్దల హస్తం ఉందని, కేసీఆర్ నియంత పాలనకు స్వస్తి పలికి.. ప్రజల వద్దకు పాలన రావాలని వారు పిలుపునిచ్చారు. అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని, ప్రజా క్షేత్రంలో బీఆర్ఎస్‌కు ఓటమి తప్పదని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధికార ప్రతినిధి విష్ణువర్ధన్‌రెడ్డి, అసెంబ్లీ అధ్యక్షుడు ఆవుల రమేష్, మండల యువజన అధ్యక్షుడు రొయ్యల రమేష్, చిన్నగౌడ్, మల్లేష్ తదితరులు ఉన్నారు.

ఇళ్ల జాబితాలో అనర్హుల పేర్లు

వనపర్తి: జిల్లా కేంద్రంలో ప్రభుత్వం విడుదల చేసిన డబుల్‌బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారుల జాబితాలో కొందరు అనర్హుల పేర్లు ఉన్నాయని, మరోసారి విచారణ చేయాలని పట్టణానికి చెందిన ఆనంద్ అనే వ్యక్తి కలెక్టర్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు అందజేశారు. ఫిర్యాదులో 29వ వార్డుకు చెందిన ఒక ఆధార్ నెంబర్‌ను పేర్కొన్నట్లు తెలిపారు.

మున్సిపాలిటీలో మరుగున పడ్డ గ్రంథాలయం

- పన్నుల నుంచి ఏటేటా నిర్వహణ ఖర్చులు చెల్లింపులు
- అయినా తెరుచుకోని తలుపులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



నిరుపయోగంగా గ్రంథాలయ భవనం

అమరచింత: పట్టణంలో కొన్నేళ్లుగా గ్రంథాలయం మూత పడి ఉన్నా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో వాటిలోని పుస్తకాలు, గ్రంథాలు చెదలు పట్టిపోతున్నాయి. మండలంగా ఏర్పాటు కాక ముందే అమరచింతలో శాఖ గంథ్రాలయం నిర్వహిస్తూ పాఠకులకు దినపత్రికలతో పాటు కథల పుస్తకాలు, వివిధ రకాల నవలలు అందుబాటులో ఉంచేవారు. మండలంగా ఏర్పడినప్పటి నుంచి గ్రంథాలయ నిర్వహణపై జిల్లా గ్రంథాలయ శాఖ దృష్టి సారించకపోవడంతో ఇప్పటికీ మూసిన తలుపులు మూసినట్టుగానే ఉన్నాయి. పట్టణంలోని కొంత మంది యువకులు, ఉపాధ్యాయులు, వివిధ రాజకీయ పార్టీల నాయకుల సహకారంతో గ్రంథాలయ అవశ్యకతను గుర్తించి చందాలతో కొనేళ్ల గ్రంథాలయంను కొనసాగించారు. మాజీ అడ్వకేట్ జనరల్, డీఎంఆర్‌ఎం ట్రస్ట్ చైర్మన్ దేశాయి ప్రకాష్‌రెడ్డి బిల్డింగ్ కిరాయితో పాటు నిర్వాహకుడికి వేతనం అందిస్తూ వచ్చారు. కొంతకాలానికి భారం అధికమవ్వడంతో వెనకడుగు వేశారు. దీంతో నాలుగేళ్లుగా గ్రంథాలయం మూతపడి ఉంది. మున్సిపాలిటీ వచ్చిన తర్వాతనైనా గ్రంథాలయానికి మహర్దశ వస్తుందని ఆశపడిన పాఠకులకు నిరాశే మిగిలింది.

మూడేళ్లుగా..

మున్సిపాలిటీ ఏర్పాటు తర్వాత అధికారుల ఆదేశాల ప్రకారం పట్టణంలో గ్రంథాలయ నిర్వహణ కోసం ఏటా ఇంటి పన్నుల వసూళ్లలో ఏడు శాతం వాటాను జిల్లా గ్రంథాలయ సంస్థకు పంపుతున్నారు. ఇలా మూడేళ్లుగా మొదటి సంవత్సరం రూ.15 వేలు, రెండో ఏడాది రూ.45 వేలు, మూడో ఏడాది రూ.92 వేలు మున్సిపాలిటీ ద్వారా చెల్లించారు. ప్రస్తుత సంవత్సరం రూ.2.30లక్షలు చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నారు. మున్సిపాలిటీ ద్వారా నిర్వహణ రుసుం అందుకుంటున్న జిల్లా గ్రంథాలయ శాఖ మాత్రం కనీసం దినపత్రికలను సైతం అందుబాటులోకి తీసుకొచ్చే ప్రయత్నం చేయట్లేదు. పట్టణానికి చెందిన యువకుడిని పార్ట్‌టైం లైబ్రేరియన్‌గా నియమించుకున్నా.. నెలవారి వేతనాలు ఇవ్వక పోవడంతో గ్రంథాలయ వ్యవస్థ మరుగున పడింది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మూత పడిన గ్రంథాలయం తెరిపించాలని యువకులు, అక్షర జ్ఞానులు కోరుతున్నారు.

అధికారుల నిర్లక్ష్యం



పట్టణంలో ఎన్నో ఏళ్లుగా గ్రంథాలయం మూతపడినా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. మున్సిపాలిటీ ద్వారా డబ్బులు తీసుకుంటున్న జిల్లా గ్రంథాలయ శాఖ పట్టణంలో కనీసం దిన పత్రికలతోనైనా గ్రంథాలయాన్ని నిర్వహించలేని పరిస్థితి ఏర్పడటం విచారకరం. ఇప్పటికైనా గ్రంథాలయాన్ని వినియోగంలోకి తీసుకురావాలి.

– తౌఫిక్, అమరచింత

నిర్వహణ ఖర్చులు చెల్లిస్తున్నాం



పట్టణంలో గ్రంథాలయం నిర్వహణ ఉందని, వాటి కోసం జిల్లా గ్రంథాలయ శాఖ వారి ఆదేశాల మేరకు ప్రతి ఏడాది వారికి నిధులు చెల్లిస్తున్నాం. అయినా గ్రంథాలయ నిర్వహణ జరగట్లేదు. ఉన్నతాధికారులకు సమస్యను విన్నవించి, గ్రంథాలయం అందుబాటులోకి వచ్చే విధంగా మున్సిపాలిటీ నుంచి చర్యలు తీసుకుంటాం.

– మహమ్మద్ ఖాజా, మున్సిపల్ కమిషనర్

బీజేపీతోనే బీసీలకు ఆత్మగౌరవం



ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

ఖిల్లాఘనపురం: రాష్ట్రంలో బీసీలకు బీజేపీతోనే ఆత్మగౌరవం పెరుగుతుందని బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా అధికార ప్రతినిధి శ్రీశైలం అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఓబీసీ మోర్చా అసెంబ్లీ కన్వీనర్ ఆశన్న ఆధ్వర్యంలో పల్లె పల్లెకు ఓబీసీ, ఇంటింటికీ బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన జిల్లా ఓబీసీ ప్రధానకార్యదర్శి కృష్ణగౌడ్ తదితరులతో కలిసి మండల కేంద్రంలో ఇంటింటికీ తిరుగుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం ఓబీసీల కోసం చేపట్టిన పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నరేంద్రమోదీ ప్రధాన మంత్రి అయిన తర్వాత ఓబీసీల కోసం ఎన్నో అభివృద్ధి పథకాలు, సంక్షేమ ఫలాలు అందించారన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం సబ్సిడీతో బీసీ కార్పొరేషన్ రుణాలు ఇవ్వడం మరిచిందని ఎద్దేవా చేశారు. రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా బీసీలను అణిచివేస్తున్నారని ఆరోపించారు.

చేతి వృత్తులకు మొండిచేయి

చాకలి, మంగళి, కుమ్మరి, కమ్మరి, గీతకార్మికులు, చేనేత తదితర చేతి వృత్తుల వారికి కేసీఆర్ ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ దేశంలో ఓ బీసీ నేతను ప్రధాన మంత్రిని, రాష్ట్రంలో బీసీ నేతను రాష్ట్ర అధ్యక్షుడిని చేసిందని గుర్తు చేశారు. రాబోయే రోజుల్లో బీసీలంతా ఏకమై బీజేపీని అధికారంలోకి తేవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి బుచ్చిబాబుగౌడ్, మండల ప్రధాన కార్యదర్శులు అంజనేయులు, శివశంకర్, ఓబీసీ మండల అధ్యక్షుడు వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి చక్రవర్తి, మండల ఉపాధ్యక్షుడు రాంచందర్, యువ మోర్చా మండల అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టండి



మాట్లాడుతున్న కాటం ప్రదీప్‌కుమార్

మదనాపురం: మండలంలోని నెల్విడిలో సోమవారం హాథ్ సే హాథ్ జోడో కార్యక్రమంలో భాగంగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కాటం ప్రదీప్ కుమార్‌గౌడ్ ఉపాధి హామీ కూలీలను కలిసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను వివరించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే స్థలం ఉన్న ప్రతి ఒక్క నిరుపేదకు ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షల ఆర్థికసాయం చేసి ఇందిరమ్మ ఇల్లు కట్టిస్తామన్నారు. రూ.500 వందలకే గ్యాస్ సిలిండర్, ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రూ.5లక్షల వరకు ఉచిత వైద్యం అందచేస్తామని తెలిపారు. రైతులకు ఏక కాలంలో రూ.2 లక్షల రైతు రుణ మాఫీ, వరి పంటకు మద్దతు ధర రూ.2,500 కల్పిస్తామని హామీ ఇచ్చారు. కౌలు రైతులకు ఏడాదికి రూ.15 వేలు, భూమి లేని ఉపాధి కూలీలకు ఏడాది రూ.12 వేలు సహాయం చేస్తామని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు అంజాద్ అలీ, మహేష్, రామచంద్రయ్య, విజయ్, రాములు, మల్లేష్, తిరుపతి నాయక్, వెంకటేష్, రామస్‌పాడ్ ఖాదీర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి అందరూ సహకరించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ కతలప్ప

వీపనగండ్ల: గ్రామాల్లో మౌలిక వసతులు, పారిశుద్ధ్యం, వ్యక్తిగత పరిశుభ్రతపై శ్రద్ధ చూపినప్పుడే గ్రామాలు అభివృద్ధి పథంలోకి వస్తాయని ఎంపీడీఓ కతలప్ప అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందికి జిల్లా నుంచి వచ్చిన ఎస్బీఎం టీం సభ్యులు శిక్షణ ఇచ్చారు. గ్రామాల్లో ప్లాస్టిక్ నిషేధాన్ని సమర్థవంతంగా ఎలా అమలుపరచాలి, ఇంకుడు గుంతల నిర్మాణాలు, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్వహణ, తదితర అంశాలపై ప్రజాప్రతినిధులు, ఈజీఎస్ ఉద్యోగులకు అవసరమైన సలహాలు అందించారు. కార్యక్రమంలో ఎంపీఓ బద్రీనాథ్, ఏపీఓ శేఖర్‌గౌడ్, ఏఈఎం రాజశేఖర్‌రెడ్డి, ఎస్బీఎం కోఆర్డినేటర్లు రమేశ్, ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్‌కు అండగా ఉందాం



సంకలమద్దిలో మహిళా సంఘం భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

అడ్డాకుల: సంక్షేమ పథకాలతో లబ్ధిపొందిన వారు తప్పకుండా సీఎం కేసీఆర్‌కు అండగా ఉండాలని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మూసాపేట మండలంలో సోమవారం ఆయన పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. పోల్కంపల్లి బీటీరోడ్డు రెన్యూవల్‌కు రూ.90లక్షలు మంజూరు కావడంతో రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. పోల్కంపల్లి, కమాలొద్దీన్‌పూర్ దారిలో రూ.4.20కోట్ల నిధులతో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సంకలమద్దిలో రూ.8లక్షలతో నిర్మించిన మహిళా సంఘం భవనాన్ని ప్రారంభించారు. మూసాపేట మండల కేంద్రంలో రూ.10లక్షలతో నిర్మించిన వాల్మీకి కమ్యూనిటీ భవనాన్ని ప్రారంభించారు. తిమ్మాపూర్‌కు చెందిన రైతు నర్సింహులు మృతిచెందడంతో రైతుబీమా ద్వారా వచ్చిన రూ.5లక్షల చెక్కును మృతుడి భార్య పద్మమ్మకు అందజేశారు. అదేవిధంగా ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఒక్కొక్కరికీ రూ.50వేల చొప్పున 6మందికి రూ.3లక్షల చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మండలానికి చెందిన 46మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. నియోజకవర్గానికి చెందిన 32మంది లబ్ధిదారులకు రూ.14.69లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. అంతకుముందు పార్టీ జెండాను ఆవిష్కరించారు. జానంపేటకు చెందిన రిటైర్డ్ ఏఎస్ఐ నర్సింహారెడ్డితో పాటు మరికొందరు బీఆర్ఎస్‌లో చేరగా, వారికి ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలో చేర్చుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే ఆల మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వాలు చేయని అభివృద్ధి పనులను తమ ప్రభుత్వం చేసిందని తెలిపారు. ప్రతిపక్షాల మాటలు నమ్మకుండా బీఆర్ఎస్‌కు మద్దతివ్వాలని కోరారు.

అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలి



మాట్లాడుతున్న స్వర్ణసుధాకర్‌రెడ్డి

చిన్నచింతకుంట: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య సమావేశ మందిరంలో ఎంపీపీ హర్షవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేస్తూ ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. వేసవికాలం ఉన్నందునా గ్రామాల్లో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు, కరెంట్ సమస్యలు తలెత్తుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం చేపట్టిన శ్మశాన వాటికలు, డంపింగ్ యార్డ్‌లు, పల్లె పకృతివనాలు, క్రీడా మైదానాలు వంటి పనుల్లో జాప్యం వహించరాదన్నారు. అభివృద్ధి కార్యక్రమాల్లో, సంక్షేమ పథకాల్లో ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వట్టెం రాజేశ్వరి, రాము, వైస్ ఎంపీపీ సుమతి, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీవితాలతో చెలగాటమా?

కొల్లాపూర్: యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని నాయకులు ముట్టడించారు. టీఎస్‌పీఎస్సీ, ఎస్సెస్సీ పేపర్ల లీకేజీపై ఎమ్మెల్యే స్పందించాలని వారు డిమాండ్ చేశారు. పేపర్ లీకేజీలో బీజేపీ, బీఆర్ఎస్ నాయకుల పాత్ర ఉందన్నారు. ఈ అంశంపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక స్కాముల్లో పాత్రదారులుగా ఉన్నారని, వాటి నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు పేపర్ లీకేజీ వ్యవహారాన్ని వెలుగులోకి తీసుకువచ్చారన్నారు. రెండు పార్టీలు విద్యార్థులు, నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నాయని ఆరోపించారు. క్యాంపు కార్యాలయంలో మాజీ మార్కెట్‌కమిటీ చైర్మెన్ నరేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

ఆర్డీటీ వ్యవస్థాపకుడికి ఘన నివాళి



కొల్లాపూర్: మండలంలోని నార్లాపూర్‌లో ఆర్డీటీ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి గ్రామస్తులు పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. సంస్థ ద్వారా పలు గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీలకు నివాస గృహాలు, ఆస్పత్రి సేవలు, విద్యను అందిస్తున్నారని గ్రామస్తులు వివరించారు. సంస్థకు పేదలు రుణపడి ఉంటారన్నారు.